
సాక్షి
చిత్తూరు

శనివారం । 11 । నవంబర్ । 2023



బ్రహ్మోత్సవం..ఆరంభం

తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారి బ్రహ్మోత్సవాలు శుక్రవారం ధ్వజారోహణంతో వైభవంగా ప్రారంభమయ్యాయి.



దొంగ ఓట్లతోనే బాబు గెలుపు

కుప్పంలో చంద్రబాబు దొంగ. స్థానికేతరుల ఓట్లతో గెలుస్తున్నారని ఎంపీ రెడ్డెప్ప, ఎమ్మెల్సీ భరత్ ఆరోపించారు.

- IIలో



శ్రీవారి దర్శనానికి 8 గంటలు

తిరుమల శ్రీవారి దర్శనానికి 8గంటలు పడుతోంది. గురువారం అర్ధరాత్రి వరకు 56,723 మంది దర్శించుకున్నారు.

న్యూస్‌రీల్

టిప్పు సుల్తాన్ జయంతి ర్యాలీ



ర్యాలీలో పాల్గొన్న ముస్లింలు

పుంగనూరు: బ్రిటీష్ పాలకులను గజగజలాడించిన స్వాతంత్ర్య సమరయోధుడు, మైసూర్ కా షేర్ టిప్పు సుల్తాన్ అంటూ వేలాది మంది ముస్లింలు ఆయన జయంతిని ఘనంగా నిర్వహించారు. శుక్రవారం సాయంత్రం వైఎస్సార్‌సీపీ నాయకుడు అస్లాం మురాధి ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. వేలాదిమందికి అన్నదానం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అలీమ్‌బాషా, కౌన్సిలర్ అర్షద్ అలి, వక్ఫ్ బోర్డు డైరెక్టర్ ఖాన్, పెద్ద సంఖ్యలో ముస్లింలు పాల్గొన్నారు. సీఐ రాఘవరెడ్డి తమ సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు. పోలీసులు బందోబస్తు చేపట్టి, ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

చిగరపల్లెలో ఆటోమెటిక్ టెస్టింగ్ స్టేషన్

చిత్తూరు రూరల్: ఆటోమెటిక్ టెస్టింగ్ స్టేషన్ ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. ఆటోమెటిక్ డ్రైవింగ్ ట్రాక్ మాదిరే వాహనాల ఫిట్‌నెస్‌ను పరీక్షించేందుకు టెస్టింగ్ స్టేషన్‌ను ఏర్పాటు చేయనుంది. అధికారుల చేతికి పని లేకుండా సాంకేతికను అందిపుచ్చుకుంటోంది. ఈక్రమంలో ఐరాల మండలం చిగరపల్లె వద్ద ఆటోమెటిక్ టెస్టింగ్ స్టేషన్‌ను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. అక్కడ భూ సేకరణకు చర్యలు చేపట్టింది. ప్రభుత్వ ఆదేశాల మేరకు అధికారులు ఆప్రాంతంలో స్థల పరిశీలన చేశారు. త్వరలో ఈ పక్రియ తెరపైకి వస్తుందని అధికారులు చెబుతున్నారు.

నేత్రపర్వం..వినాయక కల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న వేదపండితులు

కాణిపాకం(యాదమరి): గుంటూరు సంతోషి మాత ఆలయంలో గణపతి హోమం, కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామి కల్యాణం శుక్రవారం శాస్త్రోక్తంగా నిర్వహించారు. కాణిపాక దేవస్థానం, ధర్మప్రచార పరిషత్, సేవ్ టెంపుల్స్ భారత్ ఆర్గనైజేషన్ సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమాల్లో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని వీక్షించిం తరించారు. కాణిపాకం ఆలయ చైర్మన్ మోహన్ రెడ్డి, ఈఓ వెంకటేశు, సేవ్ టెంపుల్స్ సంస్థ సభ్యులు పాల్గొన్నారు.



అప్పలాయగుంటలో సంక్షేమ బోర్డును ప్రారంభిస్తున్న మంత్రి రోజా



ఒడ్డిపల్లెలో పల్లెనిద్రకు ముందు గుడ్‌నైట్ చెబుతున్న మంత్రి ఆర్కే రోజా

జగనన్నతోనే సంక్షేమం

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే జనరంజక పాలన సాధ్యమని మంత్రి ఆర్కేరోజా, పలువురు ఎమ్మెల్యేలు, పార్టీ ముఖ్య నాయకులు పేర్కొన్నారు. జిల్లాలో రెండో రోజు శుక్రవారం 'వై ఏపీ నీడ్స్ జగన్' పండుగ వాతావరణంలో జరిగింది. సంక్షేమం, అభివృద్ధి డిస్‌ప్లే బోర్డులను సచివాలయాల్లో ప్రారంభించారు. కూడలి ప్రాంతాల్లో వైఎస్సార్‌సీపీ జెండాలను ఆవిష్కరించారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ బావుటా బుక్‌లెట్లను అందజేసి, గత, ప్రస్తుత ప్రభుత్వ పాలనపై ప్రజలకు పలు ప్రశ్నలు వేసి ప్రశ్నపత్రంలో టిక్ చేసుకున్నారు. ప్రజల నుంచి అనూహ్య స్పందన లభించింది. తామంతా 'జగనన్న వెంటే' అన్ని అన్ని ప్రాంతాల్లో ప్రజలు ఆనందంగా తెలియజేశారు.

- జగనన్నతోనే పేదవాని మోములో శాశ్వత చిరునవ్వు
- అప్పలాయగుంట పల్లె నిద్రలో మంత్రి ఆర్కే రోజా
- 'వై ఏపీ నీడ్స్ జగన్' కు అనూహ్య స్పందన

పుత్తూరు: 'ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలి అంటే? ప్రజల సంక్షేమం కోసమేనని' రాష్ట్ర పర్యాటక, క్రీడా శాఖ మంత్రి ఆర్కే రోజా స్పష్టం చేశారు. శుక్రవారం వడమాలపేట మండలం అప్పలాయగుంట సచివాలయ పరిధిలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి రోజా ఒడ్డిపల్లెలో పల్లె నిద్ర చేశారు. అంతకు ముందు సచివాలయంలో నేటి ప్రభుత్వం నాలుగున్నరేళ్లుగా చేసిన సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరించారు. అనంతరం వైఎస్సార్‌సీపీ జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులతో ముఖాముఖి మాట్లాడారు. గత ప్రభుత్వానికి, నేటి జగనన్న ప్రభుత్వంలో అమలవుతున్న అమ్మఒడి, వైఎస్సార్ పెన్షన్ కానుక, జగనన్న విద్యా దీవెన, వసతి దీవెన, రైతు భరోసా, వైఎస్సార్ ఆసరా, వైఎస్సార్ చేదోడు, వైఎస్సార్ బీమా, సున్నా వడ్డీ వంటి పలు సంక్షేమ పథకాలు, జరిగిన అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. ప్రస్తుతం అమలవుతున్న సంక్షేమ పథకాల లబ్ధితో ప్రతి పేదవాని మోములో ఉన్న చిరునవ్వు శాశ్వతం కావాలంటే జగన్ మళ్లీ రావాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఎన్నికలు సమీపిస్తున్న కొద్దీ ప్రతిపక్ష తెలుగుదేశం పార్టీ మోసపూరిత వాగ్దానాలను గుప్పిస్తోందని చెప్పారు. ఇందుకు పచ్చమీడియా పనికట్టుకొని ప్రచారం చేస్తోందని ఆరోపించారు. గతంలో తాము చేసిన మంచిని చెప్పి ఓట్లు అడిగే స్థితిలో టీడీపీ లేదని, అందుకే అసత్య ప్రచారాలతో ప్రజల ముందుకు వస్తోందని విమర్శించారు. వైఎస్సార్ సీపీ వడమాలపేట మండల కన్వీనర్ సుబ్రమణ్యంరెడ్డి, జేసీఎస్ కన్వీనర్ సురేష్‌రాజు, శాప్ డైరెక్టర్ యాదవేంద్రరెడ్డి, డీఎల్ఎస్‌సీ మెంబర్ కిరణ్‌కుమార్, సోషల్‌మీడియా కన్వీనర్ చంద్రారెడ్డి, సర్పంచ్ శేషారెడ్డి, సింగిల్ విండో ప్రెసిడెంట్ సుధీర్‌రెడ్డి, పార్టీ నాయకులు లోకేష్ రెడ్డి, అయ్యప్పరెడ్డి, కమలమ్మ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా వ్యాప్తంగా..

- నగరి మున్సిపాలిటీలో జరిగిన కార్యక్రమంలో మంత్రి ఆర్కే రోజా పాల్గొన్నారు. రాయలసీమ వీర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆర్కే సెల్వమణి పాల్గొన్నారు.
- చిత్తూరు సత్యనారాయణపురంలో ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు,మేయర్ అముద పాల్గొన్నారు. చిత్తూరు రూరల్ మండలం చెర్లోపల్లెలో మండల కన్వీనర్ త్యాగరాజు ఆధ్వర్యంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు.
- పూతలపట్టు నియోజకవర్గం యాదమరిలో ఎమ్మెల్యే ఎంఎస్ బాబు, జెడ్పీ వైస్ చైర్మన్ ధనంజయరెడ్డి కార్యక్రమంలో పాల్గొన్నారు.
- పలమనేరు నియోజకవర్గంలోని గంగవరం, వి.కోట మండలాల్లో ఎమ్మెల్యే వెంకటేగౌడ, జెడ్పీటీసీ పార్వతి, పెద్దపంజాణిలో మండల కన్వీనర్ బాగారెడ్డి, జెడ్పీటీసీ సుష్మ, ఎంపీపీ ఎస్.రెడ్డెప్ప, పలమనేరులో పార్టీ కన్వీనర్ బాలాజీనాయుడు, జెడ్పీటీసీ మల్లికరంగనాథం, బైరెడ్డిపల్లె జెడ్పీటీసీ కేశవులు, ఎంపీపీ ఎం.రెడ్డెప్ప కార్యక్రమాన్ని ప్రారంభించారు.
- కుప్పం నియోజకవర్గం కుప్పంలో మండల కన్వీనర్ మురగేష్, జెడ్పీటీసీ శరవణ, ఎంపీపీ అశ్విని, గుడుపల్లెలో మండల కన్వీనర్ రామకృష్ణ, జెడ్పీటీసీ కృష్ణామూర్తి, ఎంపీపీ వరలక్ష్మి ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ భరత్ కార్యక్రమంలో పాల్గొన్నారు.
- పుంగనూరు నియోజకవర్గం పుంగనూరులో ఎంపీపీ భాస్కర్‌రెడ్డి, మండల కన్వీనర్ చెంగారెడ్డి, చౌడేపల్లెలో మండల కన్వీనర్ అంజిబాబు, జెడ్పీటీసీ దామోదారరాజు, ఎంపీపీ రామ్మూర్తి, సోమల మండల కన్వీనర్ గంగాధర్, జెడ్పీటీసీ కుసుమకుమారి, ఎంపీపీ ఈశ్వరయ్య, సదుంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి, మండల కన్వీనర్ ప్రకాష్‌రెడ్డి, జెడ్పీటీసీ సోమశేఖర్‌రెడ్డి, ఎంపీపీ యల్లప్ప, రొంపిచెర్లలో మండల కన్వీనర్ ఇబ్రహీంఖాన్, జెడ్పీటీసీ రెడ్డీశ్వరరెడ్డి, ఎంపీపీ పురుషోత్తంరెడ్డి, పులిచెర్లలో మండల కన్వీనర్ నాదమునిరెడ్డి, జెడ్పీటీసీ మురళీధర్, ఎంపీపీ సురేంద్రనాథరెడ్డి ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది.

సంక్షేమానికి కేరాఫ్ జగనన్న



మాట్లాడుతున్న ఆర్టీసీ వైస్ చైర్మన్ విజయానందరెడ్డి

శ్రీరంగరాజపురం : సంక్షేమ పాలనకు చిరునామా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని ఏపీఎస్ ఆర్టీసీ వైస్ చైర్మన్ విజయానందరెడ్డి అన్నారు. మండలంలోని కొత్తపల్లె సచివాలయంలో జరిగిన రాష్ట్రానికి జగనే ఎందుకు కావాలి అనే కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. సచివాలయం వ్యవస్థ దేశానికే ఆదర్శంగా నిలుస్తోందన్నారు. ఈ వ్యవస్థతో ప్రజలకు సంక్షేమ పాలనను చేరువ చేసిన చరిత్ర జగనన్నదని తెలిపారు. గతంలో ఎన్నడు లేనివిధంగా ఈ నాలుగున్నరేళ్లలో అర్హులైన నిరుపేద ప్రజల ఖాతాల్లోకి రూ.4.69కోట్లు జమ చేసినట్లు పేర్కొన్నారు. ప్రతి పేదవాడికి భరోసా జగనన్నతోనే సాధ్యమని తెలిపారు. పేదవర్గాల భవిష్యత్ బాగుండాలన్నా, ఆత్మగౌరవంతో బతకాలన్నా మళ్లీ జగనన్న ముఖ్యమంత్రి కావాల్సిన అవసరం ఎంతో ఉందన్నారు. సచివాలయంలో పథకాల లబ్ధి బోర్డును ఆవిష్కరించారు. జెడ్పీటీసీ సభ్యుడు రమణప్రసాద్‌రెడ్డి, డీసీసీబీ డైరెక్టర్ బాలసుబ్రమణ్యంరెడ్డి, సర్పంచ్ డీల్లయ్య, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ మణి, ఎంపీపీ సరిత, పలువురు నాయకులు పాల్గొన్నారు.



యాదమరి: జెండాను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే ఎంఎస్ బాబు



సదుం: కరపత్రాలు ఆవిష్కరిస్తున్న వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి



గంగవరంలో ప్రజాభిప్రాయ సేకరణ చేస్తున్న ఎమ్మెల్యే వెంకటేగౌడ



చిత్తూరు లో జెండా ఆవిష్కరణలో ఎమ్మెల్యే శ్రీనివాసులు



కుప్పం: మండలం పరకుంట్లపల్లెలో పల్లె నిద్రలో ఎమ్మెల్సీ భరత్

లక్షలాది పేదలకు సురక్ష



క్యాంపు పరిశీలనలో తిరుపతి డీఎంఅండ్‌హెచ్ఓ శ్రీహరి



శిబిరంలో చికిత్స చేస్తున్న వైద్యులు

పేదలకు మెరుగైన వైద్యం ఉచితంగా అది కూడా గడప వద్దకే చేరాలని జగనన్న ప్రభుత్వం నిర్ణయించింది. మారుమూలన ఉన్న గ్రామానికి వైద్యులను పంపించింది. అదే కాకుండా ప్రతి ఇంటింటిని సర్వే చేసి, అనారోగ్య సమస్యలున్న వారికి వెదికి వెదికి వారికి వైద్యం అందించేందుకు జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం చేపట్టింది. అందులో భాగంగా నెలన్నర క్రితం ప్రారంభించిన ఈ వైద్య శిబిరాలకు జనం తాకిడి పుంజుకుంది. ఉచితంగా వైద్య పరీక్షలు, చికిత్సలు చేసి మందులు, మాత్రలు పంపిణీ చేస్తూ ప్రజల ఆరోగ్యానికి భరోసా ఇస్తోంది. దీంతో జగన్న ఆరోగ్య సురక్ష పేదలకు కొండంత బలాన్నిస్తోంది.

- ఉమ్మడి జిల్లాలో 1,028 వైద్య శిబిరాలు
- 4,13,875 మందికి వైద్యం
- ఉచితంగా పరీక్షలు, మాత్రలు పంపిణీ
- వెలుగుచూసిన బీపీ, మధుమేహం కేసులు

చిత్తూరు రూరల్: ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సెప్టెంబర్ 15న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రారంభించారు. 21,147 మంది వలంటీర్లు, 902 మంది మిడ్‌లెవల్ హెల్త్ ప్రొవైడర్లు, 1,333 మంది ఏఎన్ఎంలు, 3,247 మంది ఆశా వర్కర్లు ఇంటింటికి వెళ్లి 29,51,448 మందిని ఆరోగ్య సర్వే చేశారు. స్మార్ట్ ఫోన్ ఉన్నవారికి ఆరోగ్యశ్రీ సిటిజన్ యాప్‌ను డౌన్‌లోడ్ చేయించారు. అనుమానిత వ్యక్తులకు బీపీ, మధుమేహం వంటి ఏడు రకాల పరీక్షలను ఇంటి వద్దే చేయించారు. అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటున్న వారికి టోకెన్లు ఇచ్చి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి హాజరు కావాలని పిలుపునిచ్చారు.

త్వరలో ముగియనున్న క్యాంపు

జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా సెప్టెంబర్ 30వ తేదీ నుంచి వైద్య శిబిరాలు ప్రారంభించారు. ఈ నేపథ్యంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు అన్ని శాఖల అధికారులను, సిబ్బందిని సమన్వయం చేసుకుని ముందస్తు ప్రణాళికతో క్యాంపులను విజయవంతంగా నడిపిస్తున్నారు. ఇందుకు 549 మంది స్పెషలిస్టు డాక్టర్లు, 258 మంది మెడికల్ ఆఫీసర్లను కేటాయించారు. వారు గుర్తించిన ప్రాంతాల్లో పెద్ద ఎత్తున శిబిరాలు ఏర్పాటు చేసి పేదలకు వైద్యసేవలను ఉచితంగా అందిస్తున్నారు. ఈ శిబిరాలకు జనం ఉదయం 9 గంటల నుంచే క్యూకడుతున్నారు. కార్పొరేట్ తరహాలో రోగుల వివరాలను పొందుపరచడం, వారికి ఫైల్స్ ఇవ్వడంతో పాటు ఉచితంగా చికిత్స చేస్తున్నారు. త్వరలో ఈ శిబిరాలు ముగియనున్నాయి.

పిల్లలకూ ఆరోగ్య సమస్యలు


దంత, చిన్న పిల్లల సమస్యలకూ అధికంగా ఓపీ లొచ్చాయి. ఉచితంగా వైద్యం చేసి, మాత్రలు, మందులు పంపిణీ చేశారు. ఇలా సాయంత్రం వరకు హెల్త్ క్యాంపులో డాక్టర్లు, సిబ్బంది ప్రజలకు చికిత్స అందించడంలో బిజీ బిజీగా కనిపిస్తున్నారు. జనం కూడా ఓపికగా చికిత్స చేయించుకుంటున్నారు. అక్కడ ఎలాంటి ఇబ్బందులు లేకుండా సచివాలయ సిబ్బంది సహకారం అందిస్తున్నారు. దీంతో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు విజయవంతంగా కొనసాగుతున్నాయి.

పిల్లల నుంచి వృద్ధుల వరకు

పిల్లల నుంచి వృద్ధుల వరకు జగనన్న ఆరోగ్య సురక్ష భరోసా ఇస్తోంది. వాడవాడలా ప్రభుత్వం శిబిరాలు ఏర్పాటు చేసి వైద్యం చేయించడంపై ప్రజలు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. అధికంగా గర్భిణులు, చిన్నపిల్లలు, వృద్ధులు ఈ శిబిరాలను సద్వినియోగం చేసుకున్నారు. కంటి పరీక్షలు చేసి కళ్ల అద్దాలు ఇస్తున్నారు.

ఉమ్మడి జిల్లాలో సురక్ష వివరాలు	
నిర్వహించాల్సిన వైద్య శిబిరాలు	1035
ఇప్పటివరకు నిర్వహించినవి	1028
గ్రామీణ ప్రాంతాల్లో చేపట్టినవి	899
పట్టణ ప్రాంతాల్లో నిర్వహించినవి	129
వినియోగించుకున్న వారి సంఖ్య	4,13,875
వీరిలో మహిళలు	2,28,939
వైద్య సేవలు పొందిన పురుషులు	1,84,936
కొత్తగా షుగర్ బాధితుల సంఖ్య	15,203
కొత్తగా చేరిన బీపీ బాధితులు	20,341
నేత్ర సమస్యలున్నవారు	59,623
కళ్లద్దాలు పొందిన వారు	35,615
కంటి శస్త్ర చికిత్స పొందినవారు	269
రక్తహీనత ఉన్నవారు	70,335
క్షయతో బాధపడుతున్న వారు	527
టీబీ పరీక్షలు చేయించుకున్నవారు	13,374
కొత్తగా గుర్తించిన టీబీ బాధితులు	63
ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రికి రెఫర్స్	6,683
ఆరోగ్య శ్రీ సేవలు పొందినవారు	2,802


పేదల ఆరోగ్యమే ధ్యేయం



పేదలకు అందని ద్రాక్షగా ఉన్న వైద్య సేవలను రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా అందిస్తోంది. కొత్త ఆలోచనతో సురక్ష కార్యక్రమాన్ని తీసుకొచ్చింది. పల్లెకు డాక్టరు రావడం ప్రజలు గొప్ప వరంలా భావిస్తున్నారు. ఇందులో కొందరు దాతలు కూడా స్వచ్ఛందంగా ముందుకొచ్చారు. బీపీ, మధుమేహ పరీక్ష పరికరాలను అందజేశారు. వాటిని ఏఎన్ఎంలకు అందజేశాం. ఇంత మంది క్యాంపును సద్వినియోగం చేసుకుంటున్నారని ఊహించలేదు. ప్రణాళిక ప్రకారం కార్యక్రమం కొనసాగుతోంది.

– రవిరాజు, జిల్లా నోడల్ ఆఫీసర్, జగనన్న ఆరోగ్య సురక్ష


జల్లెడ పట్టారు



జగనన్న ఆరోగ్య సురక్షతో వలంటీర్లు, వైద్య సిబ్బంది సర్వే చేసి అనారోగ్య సమస్యలను జల్లెడ పట్టారు. దీంతో పలు వ్యాధులు బయటపడ్డాయి. ప్రధానంగా బీపీ, మధుమేహం, కంటి సమస్యలు, టీబీ, క్షయ వెలుగులోకి వచ్చాయి. వారంతా కూడా ఇప్పుడు చికిత్స తీసుకునే పనిలో పడ్డారు. సకాలంలో వారి తగిన వైద్యం చేసేందుకు ఈ సురక్ష అండగా నిలిచింది. చిత్తూరు జిల్లాలో రెండు చోట్ల మాత్రమే క్యాంపు నిర్వహించాల్సి ఉంది.

– ప్రభావతిదేవి, డీఎంహెచ్ఓ, చిత్తూరు జిల్లా

విజయవంతంగా నడిచింది



నెలన్నర రోజుల పాటు జరుగుతున్న జగనన్న ఆరోగ్య సురక్ష తిరుపతి జిల్లాలో ఐదు ప్రాంతాల్లో మాత్రమే జరగాల్సి ఉంది. ఇప్పటి వరకు జరిగిన అన్ని ప్రాంతాల్లో విజయవంతంగా సాగింది. వైద్యాధికారులు బాధ్యతగా తీసుకుని కార్యక్రమాన్ని పూర్తి చేసుకుంటూ వచ్చారు. కొత్తగా మరికొంత మందికి వ్యాధులు బయటపడ్డాయి. వారందరూ కూడా జాగ్రత్తలు తీసుకుని వైద్యం చేయించుకోవాలి. నిర్లక్ష్యం వద్దు. గర్భిణులు, బాలింతలు, వృద్ధులు, చిన్నారులకు ఈ క్యాంపు ఉపయోగకరంగా మారింది.

– శ్రీహరి, డీఎంహెచ్ఓ, తిరుపతి జిల్లా

దేశానికే ఆదర్శంగా సంక్షేమ పథకాలు



సదుం: మంత్రి సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరిన టీడీపీ నాయకులు

సదుం: దేశంలోనే ఎక్కడా లేని విధంగా ఏపీలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో వైఎస్సార్‌సీపీకి ఎనలేని ఆదరణ లభిస్తున్నట్లు మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తెలిపారు. మండలంలోని చీకలచేనులో టీడీపీ నాయకులు నటరాజ, చంద్ర, నాగరాజు, శివ తదితరులతో పాటు ఇరవై మంది మంత్రి పెద్దిరెడ్డి ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. వారికి కండువాలు కప్పి మంత్రి పార్టీలోకి ఆహ్వానించారు. సంక్షేమ పథకాలే పార్టీకి శ్రీరామ రక్ష అని మంత్రి చెప్పారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు సోమశేఖర్‌రెడ్డి, సర్పంచ్ వెంకటరమణ, గణేష్‌రెడ్డి, శ్రీరాములు, రంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



దొంగ ఓట్లతోనే చంద్రబాబు గెలుపు

- ఇప్పటికే 14 వేల ఓట్లు తొలగించిన ఎన్నికల కమిషన్
- మూడు నెలలు కష్టపడితే వైఎస్సార్ సీపీదే గెలుపు
- కుప్పం, గుడుపల్లె బూత్ కమిటీ సమావేశంలో ఎంపీ, ఎమ్మెల్సీ



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ భరత్, వేదికపై ఎంపీ రెడ్డెప్ప

కుప్పంరూరల్: కుప్పంలో 35 ఏళ్లుగా చంద్రబాబు దొంగ, స్థానికేతరుల ఓట్లతో గెలుస్తున్నారని, దొంగ ఓట్లు తొలగిస్తే వైఎస్సార్ సీపీ గెలుపు తథ్యమని చిత్తూరు ఎంపీ ఎన్.రెడ్డెప్ప, ఎమ్మెల్సీ భరత్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని వాణిమహల్‌లో కుప్పం, గుడుపల్లె మండలాల బూత్ కమిటీ సభ్యులకు శిక్షణ తరగతులు నిర్వహించారు.వారు మాట్లాడుతూ 35 ఏళ్లుగా చంద్రబాబు కుప్పంలో దొంగ ఓట్లు, స్థానికేతరుల ఓట్లతో గెలుస్తున్నారని విమర్శించారు. ఇప్పటికే కుప్పంలో 14 వేల దొంగ, నకిలీ, స్థానికేతరుల ఓట్లను తొలగించినట్లు స్వయంగా ఎన్నికల కమిషనే ప్రకటించిందని, మరో 12 వేల ఓట్ల వరకు పరిశీలనలో ఉన్నట్లు వారు చెప్పారు. ఈ దొంగ ఓట్లతోనే బాబు 35 ఏళ్లుగా నెట్టుకు వస్తున్నారని ధ్వజమెత్తారు. కార్యకర్తలు, నాయకులు కష్టపడి పని చేస్తే తప్పక కుప్పంలో వైఎస్సార్ సీపీ జెండా ఎగురవేయడం అంత కష్టమేమి కాదన్నారు. పార్టీ శ్రేణులు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు.

2 నెలల్లో హంద్రీనీవా జలాలు

ఏడు మార్లు ఎమ్మెల్యేగా గెలిపించినా బాబు కుప్పం ప్రజలకు ఏమి చేయకపోగా, మరో అవకాశం ఇవ్వాలని ఆశించడం ఆయన స్వార్థ రాజకీయాలకు నిదర్శనమని ఎంపీ రెడ్డెప్ప పేర్కొన్నారు. దివంగత నేత రాజశేఖరరెడ్డి పాలన వచ్చే వరకు కుప్పంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు కాని విషయాన్ని గుర్తు చేశారు. ఆయన తనయుడు జగన్‌మోహన్‌రెడ్డి కుప్పం పోలీసు, రెవెన్యూ డివిజన్లుగా ప్రకటించి కుప్పంను మున్సిపాలిటీగా అప్‌గ్రేడ్ చేశారని చెప్పారు. మరో అడుగు ముందుకేసి కుప్పంకు శాశ్వత తాగు, సాగునీటి అవసరాలు తీర్చేందుకు హంద్రీనీవా జలాలు తెస్తున్నారని పేర్కొన్నారు. మరో రెండు నెలల్లో ముఖ్యమంత్రి చేతుల మీదుగా హంద్రీనీవాను ప్రారంభించేందుకు మంత్రి పెద్దిరెడ్డి ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నట్లు వివరించారు. కుప్పం పరిశీలకుడు నరేష్‌కుమార్‌రెడ్డి, మున్సిపల్ చైర్మెన్ డాక్టర్ సుధీర్ మాట్లాడుతూ, చంద్రబాబు మెజారిటీ కోసం టీడీపీ కష్టపడితే, మనం భరత్‌ను గెలిపించుకోవాలనే ఒకే ఒక్క లక్ష్యంతో పని చేయాలన్నారు. ఎంపీపీలు అశ్విని, వరలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు కృష్ణమూర్తి, ఎన్నికల పరిశీలకుడు రెడ్డెప్ప, హెచ్‌ఎం మురుగేష్, రెండు మండలాల వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. అనంతరం మండల పరిధిలోని జరుగు పంచాయతీ పరకుంట్లపల్లెలో ఎంపీ రెడ్డెప్పతో కలిసి ఎమ్మెల్సీ భరత్ జెండా ఆవిష్కరణలో పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి సర్కారు కృషి



బహుమతులు అందజేస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాసులు

చిత్తూరు కలెక్టరేట్ : గతంలో ఎన్నడూ లేనివిధంగా వైఎస్సార్ సీపీ సర్కారు విద్యాభివృద్ధికి రూ.వేల కోట్లు ఖర్చు చేస్తోందని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు అన్నారు. శుక్రవారం మిట్టూరు విజ్ఞానదీప్తి పాఠశాలలో 31వ జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్ జిల్లా స్థాయి పోటీలు ఏపీ కౌన్సిల్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ (ఆప్‌కాస్ట్) ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముగింపు కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ సైన్స్‌కు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని తెలిపారు. డీఈవో విజయేంద్రరావు మాట్లాడుతూ దేశంలో శాస్త్ర, విజ్ఞాన, సాంకేతిక రంగాల్లోని పరిశోధనలను ప్రోత్సహించాలన్నదే జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్ ముఖ్య ఉద్దేశమన్నారు. పాఠశాల కరస్పాండెంట్ రామచంద్రారెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు సైన్స్ పట్ల ఆసక్తిని పెంచుకోవాలన్నారు. ఆప్‌కాస్ట్ జిల్లా కోఆర్డినేటర్ భువనేశ్వరి మాట్లాడుతూ జిల్లా స్థాయి పోటీలకు వివిధ పాఠశాలల నుంచి పాల్గొన్న విద్యార్థులు 167 సైన్స్ ప్రాజెక్టులను ప్రదర్శించారన్నారు. 7 ప్రాజెక్టులను రాష్ట్ర స్థాయికి న్యాయనిర్ణేతలు ఎంపిక చేశారన్నారు. ప్రతిభ చాటిన విద్యార్థులకు సర్టిఫికెట్, మెమెంటోలు, పాల్గొన్న విద్యార్థులకు బహుమతులను అందజేశారు. డీవైఈవో చంద్రశేఖర్, ఎంఈవో-1,2 సెల్వరాజ్, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ మండల అధ్యక్షుడిపై ఎస్సీ, ఎస్టీ కేసు

గుడిపాల: తెలుగుదేశం పార్టీ గుడిపాల మండల అధ్యక్షుడు సుబ్రమణ్యంనాయుడుపై శుక్రవారం ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు ఇన్‌చార్జ్ ఎస్‌ఐ సుధాకర్‌రెడ్డి తెలిపారు. ఆయన కథనం మేరకు.. వెంగమాంబపురం దళితవాడకు చెందిన జస్టిన్(29) కమ్మతిమ్మాపల్లె క్రాస్‌లో ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంక్‌లో పంప్ ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడు. పెట్రోల్ బంక్ వద్దకు వచ్చిన సుబ్రమణ్యంనాయుడు కారులో హారన్ కొడుతూ ఉన్నారు. పంప్ దగ్గరే ఉన్నాను ఎందుకు హారన్ కొడుతున్నారని అడగ్గా, తక్కువ జాతి వాళ్లు అంటూ కులం పేరుతో అసభ్య పదజాలాలతో తిట్టారు. బాధితుడి ఫిర్యాదు మేరకు సుబ్రమణ్యం నాయుడిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

14న ఏపీ వీవీపీ కమిషనర్ రాక

చిత్తూరు రూరల్: జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి ఈనెల 14న రాష్ట్ర వైద్య విధాన పరిషత్ కమిషనర్ వెంకటేశ్వర్లు రానున్నట్లు తెలిసింది. జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి అధికారులు, అపోలో నిర్వాహకుల మధ్య సమన్వయం లోప సమస్య ముదురుతోంది. ఈ వ్యవహారంపై జిల్లా యంత్రాంగం సర్దుబాటు చేయాలని ప్రయత్నించినా మళ్లీ లోపం తలెత్తుతోంది. ఈవిషయమై ఫిర్యాదుల పరంపర కొనసాగడంతో కమిషనర్ వరకు వెళ్లింది. దీంతో కమిషనర్ నేరుగా విచారణకు దిగనున్నారని తెలిసింది. ఈయనతో పాటు డీఎంఈ(డైరెక్టర్ ఆఫ్ మెడికల్ అండ్ హెల్త్ అధికారి) రానున్నట్లు సమాచారం.

ఫిర్యాదులకు సత్వరం పరిష్కారం

నింద్ర: ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు ఆదేశించారు. ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం జగనన్నకు చెబుదాం కార్యక్రమం నిర్వహించారు. ప్రజల నుంచి జేసీ ఫిర్యాదులు స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారానికి సత్వరం చర్యలు తీసుకునే ఉద్దేశంతో ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తోందన్నారు. కార్యక్రమంలో అందిన అర్జీలపై తీసుకున్న చర్యలపై 15 రోజుల తర్వాత అధికారులతో సమీక్షిస్తామన్నారు. ఎంపీపీ దీప, సర్పంచ్ వసంతమ్మ, హౌసింగ్, డ్వామా పీడీలు పద్మనాభం, గంగాభవాని, ఆర్‌డీవో సుజన, డీటీసీ నిరంజన్ రెడ్డి, డీపీవో లక్ష్మి, వ్యవసాయ, ఉద్యాన, పశు సంవర్ధక, మత్స్యసహకార శాఖ అధికారులు మురళీకృష్ణ, మధుసూదన రెడ్డి, ప్రభాకర్, రవికుమార్, బ్రహ్మానందరెడ్డి, ఏపీఎంఐపీ పీడీ రమణారెడ్డి, బీసీ వెల్ఫేర్, ఇతర జిల్లా అధికారులు, తహసీల్దార్ భగవతి, ఎంపీడీవో అరుణ పాల్గొన్నారు.

టెర్రకోట హస్త కళాకారులకు శిక్షణ



మాట్లాడుతున్న సత్యమూర్తి

పలమనేరు: పట్టణ సమీపంలోని గంటావూరు టెర్రకోట హస్తకళాకారులకు ఐదునెలల శిక్షణా కార్యక్రమం శుక్రవారం ప్రారంభమైంది. ఏపీ హస్తకళల అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఎండీ బాలసుబ్రమణ్యం రెడ్డి ఆదేశాల మేరకు ఆ సంస్థ అసిస్టెంట్ డైరెక్టర్ సత్యమూర్తి ఇక్కడి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ, ఇక్కడి కళాకారుల్లో 30మందిని ఎంపిక చేసి వారికి ఐదు నెలల పాటు మస్టార్ క్రాఫ్ మెనూ, కొత్త డిజైన్లు, టెర్రకోటలో న్యూ ట్రెండ్స్‌పై శిక్షణనిస్తున్నట్టు తెలిపారు. శిక్షణానంతరం వారికి సర్టిఫికెట్లను అందజేస్తామన్నారు. దీంతో బ్యాంకు రుణం, అలాగే స్వయం ఉపాధి పొందవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో లేపాక్షి హ్యాండీక్రాఫ్ట్స్ మేనేజర్ వెంకట లక్ష్మణ్, రీచ్ ఫౌండేషన్ సిబ్బంది క్రిష్ణమూర్తి, స్థానిక టెర్రకోట సంఘ నాయకులు రామక్రిష్ణ, మోహన్ తదితరులు పాల్గొన్నారు.